నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 25 నవంబర్ 2024 | MEDAK

29న దీక్షాదివస్

అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహణ

జిల్లా ఇన్‌చార్జిలను ప్రకటించిన బీఆర్ఎస్

సిద్దిపేట, నవంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈనెల 29న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షాదివస్ ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించారు. సిద్దిపేట జిల్లాకు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మెదక్ జిల్లాకు ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, సంగారెడ్డి జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డిలను నియమిస్తూ ఆదివారం బీఆర్ఎస్ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షాదివస్ నిలుస్తుంది. 2009 నవంబర్ 29న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ ఇన్‌చార్జిలు నియమించడంతో వారు అన్ని నియోజకవర్గాల్లోని క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు.



సూర్యబింబాకారంలో దీపారాధన చేస్తున్న భక్తులు

భక్తపాలుడు.. నాచగిరి లక్ష్మీనరసింహుడు

వర్గల్, నవంబర్ 24: మండలంలోని నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కార్తిక మాసం చివరి ఆదివారం భక్తజనులతో కిక్కిరిసిపోయింది. భక్తపాల నరసింహస్వామి అంటూ భక్తులు మూడునామాలస్వామిని స్మరిస్తూ పూజలు చేశారు. ఆదివారం సూర్యబింబం ఆకారంలో భక్తులు వెలిగించిన కార్తిక దీపాలు ఆకట్టుకున్నాయి. 165 మంది జంటలు సామూహిక వ్రతాలు ఆచరించగా, 16 మంది జంటలు జలాభిషేకాలు, ఆరు జంటలు స్వామివారి పేరిట నిత్యకల్యాణాలు జరిపించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, సిబ్బంది పాండు, నరేందర్‌గౌడ్ భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

ఫైనాన్స్ వేధింపులకు తాళలేక బైక్‌కు నిప్పు

దగ్ధమవుతున్న బైక్

శివ్వంపేట, నవంబర్ 24: ఫైనాన్స్ ప్రతినిధుల వేధింపులకు తాళలేక ఓ వ్యక్తి బైక్‌కు నిప్పుపెట్టిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడురులో చోటుచేసుకున్నది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గూడురు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఈఎంఐ పద్ధతిలో బైక్‌ను కొనుగోలు చేశాడు. ఐదారు నెలల ఈఎంఐలు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయి కోసం ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు శనివారం ఇంటికి వచ్చి ఫైనాన్స్ చెల్లించాలనడంతో మనోవేదనకు గురైన ఆ వ్యక్తి ఆగ్రహంతో ఫైనాన్స్ సంస్థ ప్రతినిధుల ముందే బైక్‌కు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయంలో పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ట్రాక్టర్ చోరీ కేసులో నిందితుల రిమాండ్

నిందితులను చూపుతున్న ములుగు, గౌరారం ఎస్సైలు కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్

ములుగు, నవంబర్ 24: ట్రాక్టర్ చోరీ కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ములుగు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన పల్లచ్చు స్వామి ఈనెల 21న పొలంలో ఉంచిన ట్రాక్టర్ కనిపించడంలేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించి జీపీఎస్ ఆధారంగా ట్రాక్టర్ ఉన్న చోటును గుర్తించి నిందితులైన యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన చెరుకుపల్లి రవీందర్‌రెడ్డి, అలమైన మల్లేశ్, ములుగు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన అన్నెబోయిన నాగరాజు, పల్లె ప్రవీణ్‌లను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి రెండు ట్రాక్టర్లు, కారు, ద్విచక్ర వాహనం, రూ. 45 వేల నగదును స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ తరలించినట్లు ములుగు ఎస్సై విజయ్‌కుమార్, గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

సైకిల్ దంతెతో.. కలుపుతీత

ఒకప్పుడు కాడెద్దులతో కలుపుతీత పనులు చేపట్టేవారు. మహిళలు వారి వెనకాల చిన్న చిన్న పనిముట్లతో కలుపు తీసేవారు. ప్రస్తుతం మహిళా రైతులు సైకిల్‌తో చేసిన దంతెలను వాడుతూ కలుపుతీత పనులు చేపడుతున్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ శివారు మిర్చి తోటలో సైకిల్ దంతెతో మహిళా రైతు కలుపు తీస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, నవంబర్ 24

ఎల్లమ్మ చెరువులో కొండచిలువ కలకలం

కొండచిలువను తీసుకెళ్తున్న అటవీశాఖ అధికారులు

హుస్నాబాద్, నవంబర్ 24: హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువులో మత్స్యకారులు చేపల కోసం వేసిన వలకు కొండచిలువ చిక్కింది. ఆదివారం వలను తీస్తున్న క్రమంలో వలలో కొండచిలువ ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా రిస్కీటీంతో వచ్చిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహ్మద్ పరాద్ వల నుంచి కొండచిలువను వేరు చేయించారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలేందుకు తీసుకెళ్లారు. ఎల్లమ్మచెరువులో కొండ చిలువ ఉండడంతో మత్స్యకారులు, స్విమ్మర్లు భయాందోళనలకు గురవుతున్నారు. ఇంకా ఏమైనా కొండ చిలువలు చెరువులో ఉన్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. రిస్కీ టీం సభ్యుడు అబ్బాస్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపైనే అమ్మకాలు

- సమీకృత మార్కెట్ నిర్మించినా ప్రయోజనం సున్నా..
- రూ.22.85కోట్లతో మార్కెట్ నిర్మాణం
- పట్టించుకోని అధికారులు
- మార్కెట్‌లోకి రాని వినియోగదారులు
- తప్పక రోడ్లపైనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు
- వినియోగదారులు మార్కెట్‌కు వచ్చేలా పాలకమండలి దృష్టి సారించాలంటున్న వ్యాపారులు

గజ్వేల్‌లోని ఇందిరాపార్కు చౌరస్తాలో పండ్ల దుకాణాలు

రోడ్డు పక్కనే కూరగాయల అమ్మకాలు

సమీకృత మార్కెట్ ఉన్నా రోడ్లపైనే అమ్మకాలు

ప్రజాధనం వృథా

గజ్వేల్, నవంబర్ 24: వినియోగదారులకు కూరగాయలు, పూలు, పండ్లు, మాంసం, చేపలు ఒకేచోట దొరికేలా సమీకృత మార్కెట్‌ను కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించారు. గజ్వేల్‌లో సమీకృత మార్కెట్‌ను సకల హంగులతో నిర్మించి నాలుగేండ్ల క్రితం వినియోగంలోకి తీసుకొచ్చారు. కానీ వ్యాపారులు రోజూ రోడ్లపైనే అమ్మకాలు చేపట్టడంతో మార్కెట్‌లో అమ్ముకునే వారికి గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు చౌరస్తా నుంచి ఢిల్లీవాలా హోటల్ వరకు ట్రాఫిక్ సమస్యతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను మార్కెట్, మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వదిలేయడంతో సమస్య జఠిలమవుతుందని పట్టణవాసులు వాపోతున్నారు. ఢిల్లీవాలా హోటల్ వరకు రోజూ రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల అమ్మకాలతో దుకాణాదారులకూ సమస్యగా మారింది. రోడ్లపైనే అమ్మకాలు చేపట్టడంతో మార్కెట్‌లోకి వినియోగదారులు తక్కువ సంఖ్యలో రావడంతో గిరాకీలు లేక చాలామంది వ్యాపారులు అమ్మకాలకు దూరంగా ఉంటున్నారు. సకల వసతులతో నిర్మించిన సమీకృత మార్కెట్‌లోనే వ్యాపారులు అమ్మకాలు జరిపేలా చూడాలని విక్రయదారులు కోరుతున్నారు. అన్ని శాఖల అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.22.85కోట్లతో మార్కెట్ నిర్మాణం

కేసీఆర్ ప్రభుత్వం హయాంలో గజ్వేల్ పట్టణంలో సమీకృత మార్కెట్‌ను రూ. 22.85 కోట్లతో 6ఎకరాల విస్తీర్ణంలో నిర్మించింది. ఇందులో 246 స్టాల్స్ ఉండగా అందులో 52 స్టాళ్లు మాంసం, చేపల విక్రయానికి, 111 స్టాళ్లు కూరగాయలు, 83 స్టాళ్లు పూలు, పండ్ల విక్రయానికి కేటాయించారు. మార్కెట్‌ను ప్రారంభించిన తరువాత ఇక్కడ రోజుకు 10క్వింటాళ్ల కూరగాయలు, మూడు క్వింటాళ్ల పూలు, 2 క్వింటాళ్ల పండ్లు అమ్ముడుపోయేవి. ఈ సమీకృత మార్కెట్ నిర్వహణ బాగుండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించింది. రోడ్ల పక్కన కూరగాయలు, పండ్ల అమ్మకాలు కొనసాగుతుండడంతో సగానికి పైగా స్టాళ్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇటీవల ఏర్పాటైన కొత్త పాలకమండలి సమీకృత మార్కెట్‌పై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

రోడ్లపై అమ్మకాలు లేకుండా చూస్తాం..

రోడ్లపైన కూరగాయలు, పండ్ల అమ్మకాలు లేకుండా చూస్తాం. ఇప్పటికే రోడ్ల పక్కన అమ్ముకునే వారికి అవగాహన కల్పించి మార్కెట్‌లోపల అమ్ముకునేలా చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్ సిబ్బంది రోడ్లపై పర్యవేక్షణ చేస్తున్నారు.– జాన్‌వెస్లీ, మార్కెట్ కార్యదర్శి

సర్వే డాటా ఎంట్రీ కీలకం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- డోర్‌లాక్, వలస వెళ్లినవారి వివరాలు ఫోన్‌లో సేకరించాలి
- సమగ్ర కుటుంబ సర్వేపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెదక్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని, సర్వే డాటా ఎంట్రీ చాలా కీలకమని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే డాటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. సర్వే దశలో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే ఫోన్‌లో వివరాలు సేకరించాలని ఆదేశించారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, సీపీవో బద్రినాథ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు చేరుకున్న ఇంటింటి సర్వే

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 24: ప్రభుత్వం ప్రాతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఎంతో కీలకమైనదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సర్వే చివరి దశకు చేరుకున్నదని పేర్కొన్నారు. డాటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైనదని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టిందన్నారు. సర్వేలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయని, వారికి ఫోన్‌లో వివరాలు సేకరించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

సంగారెడ్డిలో వేగంగా సర్వే పనులు

సంగారెడ్డి జిల్లాలో సర్వే పనులు వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. వలస కుటుంబాలు, డోర్ లాక్ కుటుంబాలను గ్రామాలకు పిలిపించి సర్వే చేస్తున్నట్టు పేర్కొన్నారు. వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఇతర జిల్లా ఉన్నతాధికారులు మండలాల్లో పర్యటించినప్పుడు వసతి గృహాలు, సంక్షేమ గురుకులాల్లో తనిఖీ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో సర్వే పనులు వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ మనుచౌదరి ఉప ముఖ్యమంత్రికి వివరించారు. వలస కుటుంబాలు, డోర్ లాక్ కుటుంబాలను గ్రామాలకు పిలిపించి సర్వే చేస్తున్నట్టు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి హరీశ్‌రావు సంతాపం

రాంచంద్రారెడ్డి (ఫైల్)

రవీందర్‌రెడ్డి (ఫైల్)

సిద్దిపేట, నవంబర్ 24: సిద్దిపేట జిల్లా కొండపాక వాస్తవ్యులు అప్పటి దొమ్మాట (ప్రస్తుతం దుబ్బాక) నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మృతి పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు.. 1983-88లో అప్పటి దొమ్మాట నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేశారని, తన సేవలు నేటితరం రాజకీయ నాయకలకు ఎంతో స్ఫూర్తి అని కొనియాడారు, ఎమ్మెల్యే అయినా తన తుదిశ్వాస వరకు సాధారణ జీవితాన్ని గడిపారని, ప్రజాసేవకు పరితపించారని, తన సేవలు నియోజకవర్గ ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మాజీ ప్రిన్సిపాల్ మృతికి ..

చిన్నకోడూరు మండలం గోనేపల్లికి చెందిన విశ్రాంత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కూర రవీందర్‌రెడ్డి మృతికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు. రాష్ట్ర ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడిగా, ఉపాధ్యాయుడిగా రవీందర్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సిద్దాపూర్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న వెజ్, నాన్ వెజ్ దుకాణ సముదాయం

నిరుపయోగంగా వదిలేశారు..!

- సదాశివపేట పట్టణంలో ఖాళీగా మున్సిపల్ దుకాణాలు
- ప్రారంభానికి నోచుకోని దుస్థితి
- ఏండ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- లక్షల ఆదాయానికి గండి

సదాశివపేట, నవంబర్ 24: సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డులో ఉన్న దుకాణ సముదాయాన్ని అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. నెలకు లక్షల ఆదాయం వచ్చే కూరగాయలు, నాన్ వెజ్ మార్కెట్ దుకాణ సముదాయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏండ్లు గడుస్తున్నా వ్యాపారులకు కేటాయించకుండా ఖాళీగా ఉంచారు. దీంతో మున్సిపల్‌కు వచ్చే ఆదాయానికి గండి పడుతున్నది.

19దుకాణాలు..

పట్టించుకోని అధికారులు

పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డులో 2015-16 సంవత్సరంలో రూ.30లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో 19 దుకాణాలను నిర్మించారు. సెప్టెంబర్ 26, 2018లో వెజ్, నాన్ వెజ్ దుకాణ సముదాయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొన్ని రోజులకు నిర్మాణ పనులు చేపట్టి దుకాణ సముదాయాన్ని నిర్మించారు. దుకాణ సముదాయన్ని నిర్మించి ఏండ్లు గడుస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. దుకాణ సముదాయం ఖాళీగా ఉన్నందున మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండి పడుతున్నది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దుకాణ సముదాయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

చలి పంజా

- మెదక్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

మెదక్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాపై చలి పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి తగ్గుతున్నాయి. ఉదయం 7 గంటలు దాటినా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున మంచు కురుస్తుండడంతో పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్ముకుంటుంది. సాయంత్రం 5 గంటలు దాటితే చల్ల గాలులు వీస్తున్నాయి. చలికాలం జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా చిన్నారులు, వృద్ధుల్లోనే కనిపిస్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా కూడా సులభంగా వ్యాప్తి చెందే ప్రమాదముంది. వచ్చే రెండు, మూడు నెలలు ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. దీంతో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు ఈ సమయంలో చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు కూడా చలి తీవ్రత నుంచి తట్టుకునేందుకు తప్పనిసరిగా తగిన రక్షణ తీసుకోవాలని సూచిస్తున్నారు.

రెండున్నర నెలలు చలి తీవ్రత

నవంబర్, డిసెంబర్, జనవరి వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో జలుబు, దగ్గు రావడతోపాటు కండరాలు కుచించుకుపోతాయి. రక్తనాళాలు గడ్డ కట్టుకుపోయి ఇతర జబ్బులు కూడా వచ్చే ఆస్కారముంది. ప్రస్తుతం చలి కాలం ప్రారంభ దశలో ఉండటంతో చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరముంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా జ్వరం, జలుబు, దగ్గు శ్వాస సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంతేకాదు తలనొప్పి, గొంతు సమస్యలతో పాటు శ్వాస పీల్చడంలో ఇబ్బందులు తలెత్తుతాయి.

మెదక్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు

తేదీ	డిగ్రీల్లో
24	11.2
23	11.4
22	11.9
21	12.5
20	11.6
19	11.5
18	12.1
17	13.5
16	16.1
15	17.0
14	18.2
13	17.0
12	15.2

అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి

ప్రవీణ (ఫైల్)

రాయపోల్, నవంబర్ 24: అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో అదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి కిషన్ వృత్తిరీత్యా ఆర్ ఎంపీ వైద్యుడు. తన మొదటి భార్య పద్మ అనారోగ్యంతో కొన్నేండ్ల క్రితం మృతిచెందింది. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మొదటి భార్య మృతి చెందడంతో రెండేండ్ల క్రితం నిర్మల్ పట్టణానికి చెందిన ప్రవీణను వివాహం చేసుకున్నాడు. పెండ్లి జరిగిన కొద్ది రోజుల నుంచే డబ్బుల విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. మొదటి భార్య పెద్ద కుమారుడైన శ్రీనివాస్ అతడి భార్య వల్లే గొడవలు జరుగతున్నాయని స్థానికులు తెలిపారు. ఇమ్మడి కిషన్ హన్‌మాన్ దీక్ష ధరించాడు. దీక్షలోనే ఆదివారం ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి తిరిగి ఆలయం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కొడుకు శ్రీనివాస్ అతడి భార్యతో ఇంట్లోనే ఉన్నాడు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి భర్త కిషన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మృతురాలి బంధువులు వచ్చే వరకు మృతదేహాన్ని ఇక్కడే ఉంచాలని స్థానికులు అడ్డుకున్నారు. మృతురాలి చేతులకు గాయాలు ఉన్నందున మృతిపై పలు అనుమానాలు ఉన్నయని, మృతురాలి బంధువులు వచ్చే వరకు ఇక్కడే ఉంచాలని స్థానికులు పట్టుబట్టడంతో పోలీసులు శవాన్ని ఇంట్లోనే ఉంచారు. మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.